# కళ్లని చెయ్యగలవా ఖూనీ?



అవసరాల రామకృష్ణారావు

అంతవరకూ చెవులు గింగిర్లు ఎత్తే అన్ని వాయిద్యాలూ ఒక్కసారి ఆగిపోతాయి. దీక్షగా ఒక్కసారి చూస్తే చాలు, కళ్లు చీకట్లు కమ్మే అంత వెలుగూ అకస్మాత్తుగా కటిక చీకటిగా మారిపోతుంది. ఆ మేజిక్ షోలో ఆఖరి భాగాన్ని ఊహించుకుంటూ అంతకుముందే అన్ని వేల ప్రేక్షకుల గుండెలూ ఆగిపోయి ఉంటాయి.

ఆ భయంకర నిశ్శబ్దంలో చిరుగజ్జెల గలగల. ఆ చీకటి సాగరంలో అల్లంత దూరాన ఓ చంద్రరేఖ. స్టేజిమీద కనిపించే దృశ్యం మేడమెట్లు దిగుతున్న ఓ జగదేక సుందరి. కాలి గజ్జెలు సరిగ్గా ఉన్నాయో లేదో అనే నెపం మీద వయ్యారమంతా కురిపిస్తూ సవరించుకుంటూ మాటలు మొదలుపెట్టిన రాచిలుకా.

'మాయాజాలంలో పడి మనసు మరచిన మహనీయులకు నమస్కారాలు. మధుర మరంధం అందిస్తున్న యీ అందం ఇంకో గడియకి ఉంటుందని ఏమిటి నమ్మకం? మనిషి ఉంటేనే వయ్యారాల నడకలూ గజ్జెల సవ్వడులూ ....ఈ శరీరమే యింకో క్షణంలో సరిగ్గా రెండు ముక్కలు అయిపోతే!'

అయిపోతే, అయిపోతే? అనుకుంటూ స్టేజిమీద అడ్డంగా ఉన్న పెద్ద పెట్టెని ఆ అమ్మాయి చేరుకునే లోగా మరొకసారి అన్ని లైట్సూ ఆఫ్.

రెండు నిముషాల్లో, లైట్లు డిమ్‌గా వెలుగుతాయి. ఎత్తైన బల్లమీద అమర్చబడిన పెట్టెలో ఆ అమ్మాయి అప్పటికే పడుకుని ఉంటుంది. ఒకవైపు తలా చేతులూ, మరో వైపు పాదాలూ యివే పైకి కనబడేవి. రెండు పక్కలా చెరో అసిస్టెంటూ ఉంటారు. మెజీషియన్ మన్‌మోహన్ మాట్లాడుతాడు.

'ఇప్పుడు మీరు యీ పెట్టెలో చూస్తున్నది ఇందాక మెట్లు దిగిన అమ్మాయే. ఏమాత్రం సందేహం లేదు. ఇందులో ఏం మోసంలేదు గనక. ఇందులో పడుకున్నది రక్తమాంసాలు గల మనలాంటి మనిషే. బొమ్మ కాదు. ఈ తలా యీ చేతులూ యీ కాళ్లూ అన్నీ నిజమైనవే. కావలిస్తే మీరే చూడండి.

మరోసారి అన్ని లైట్లూ ఆరిపోయి మొదట అమ్మాయి మొహంఉన్న వైపు లైట్ ఫోకస్ అవుతుంది. వీలయినంత వరకు తల ప్రేక్షకుల వైపు తిప్పి, సమ్మోహనకరంగా నవ్వుతూ రెండు చేతులూ మరింత దగ్గరగా చేరుస్తుంది ఆమె. ఈ సారి లైటు పాదాల వైపు పడుతుంది. ఆమె పాదాలు కదుపుతుంది. గజ్జెల చప్పుడు స్పష్టంగా వినపడుతుంది. ఆ గజ్జెల చప్పుడు యిదివరకు వాళ్లు విన్నదే. అప్పుడది గుండెల మీద పూల

జల్లు. ఇప్పుడు ఈ చప్పుడుతో వాళ్ళకి కలిగిన ప్రతి స్పందన సానుభూతితో కూడిన జాలి జల్లు. పైన విద్యుత్తుతో నడిచే రంపం సిద్ధంగా ఉండనే ఉంది. ఇంకెంత సేపు!

ఏదో మరచిపోయినట్టు మెజీషియన్ అసిస్టెంటుతో చెబుతాడు. అసిస్టెంటు ఆమె కాలిగజ్జెలు విప్పేసి బల్లమీద పెట్టి, రెండుకాళ్లూ కదలకుండా పట్టుకుంటాడు. తల దగ్గర అసిస్టెంటూ అలాగే ఆమె తలా చేతులూ అణిచిపెట్టి పట్టుకుంటాడు. మెజీషియన్ స్విచ్ నొక్కడంతో రంపం నెమ్మది నెమ్మదిగా కిందికి దిగుతుంది. ఆమె తలా కాళ్లూ కొట్టుకుంటుండగా రంపం ఆమె మధ్యగా పెట్టెమీదికి చేరుతుంది. మన కళ్ల ఎదురుగుండానే పెట్టెని, అడ్డంగా, లోనున్న మనిషితో సహా, రెండు ముక్కలు చేస్తూ కిందకి దిగిపోతుంది రంపం. కిందకి సరిగ్గా దిగిందో లేదో అనుమానం అక్కర్లేదు. అంతకు ముందే అక్కడ ఉంచిన రేకు మీద స్పష్టంగా చప్పుడు చేస్తుంది. అంతే కాదు, ఆ మధ్య జాగాలో మెజీషియన్ అరచేయి అడ్డంగా పోనిచ్చి రెండు ముక్కలయిందని రుజువు చూపిస్తాడు. పెట్టెమీద నల్లగుడ్డ కప్పేస్తాడు.

మరో రెండు నిముషాలు మళ్లీ లైట్లన్నీ బంద్.

క్రమక్రమంగా ఎక్కువౌతున్న వెలుగులో మళ్లీ అదే అమ్మాయి, మెట్లెక్కి వెళ్లిపోతూ, ఏదో మరచినట్టు ఓ క్షణం ఆగి,

'అయ్యో నాగజ్జెలు మరచిపోయానే!' అంటుంది.

అసిస్టెంటు బల్లమీది గజ్జెలు విసరగా ఆమె అందుకుంటుంది. వెళ్లే ముందు ప్రేక్షకులతో చిన్న ముచ్చట: 'చూశారా! అంతలో వెలుగు, అంతలో చీకటి! అంతలో రెండు తునకలు, అంతలో హంస నడకలు! మీరు చూసిన మాయా ప్రపంచం ఇంతే! ఇంతే సుమా!!'

చప్పట్ల వర్షంతో హాలు దద్దరిల్లి పోతుంది.

ఎప్పుడో ఆర్నెల్ల క్రితం చూశాను ఇతనిదే. ఇదే షో. ఎక్కడో వంద మైళ్ల దూరంలో ఉందని పేపర్లో చదివి పిచ్చివాణ్ణై ఈ ఊరు పరిగెత్తుకు వచ్చి ఎటెండ్ అయాను మళ్ళీ. ముఖ్యంగా ఆ ఆఖరి ఐటమే. ఎప్పుడో కాదు ఈ క్షణం చూసినంత ఫ్రెష్‌గా నా గుండెని పట్టేసింది అది. ఈ ఎక్సైట్‌మెంట్ ఎవరితోనైనా చెప్పుకుంటే గాని ఉండలేక పోయాను. కొత్త ఊరు. ఎవరు కనబడతారు! అయినా ఆశతో గేటు దగ్గర గుంపుని పరికిస్తూ ఓ పక్కగా నిలబడ్డాను.

'ఎవరి కోసం చూస్తున్నారు?' వెనక నుంచి తియ్యని కంఠం వినబడి పులిక్కిపడి అటు తిరిగేను. ఎవరో ఒంటరి అమ్మాయి, ఓ చేతిలో బ్రీఫ్‌కేస్‌తో.

'ఈ షోలో లాస్ట్ ఐటమ్ నన్ను బాగా ఇంప్రెస్ చేసింది. ఎవరైనా తెలిసిన వాళ్లు కనబడితే డిస్కస్ చేద్దామనీ....'అని చెప్పబోయాను.

'సర్‌ప్రైజింగ్. ఆ లాస్ట్ ఐటమ్ పెర్ఫార్మెన్స్‌తో నాకూ సంబంధం ఉంది. అదిగాక హాస్పటల్ బెడ్ మీంచి నేనిలా తప్పించుకున్నానని తెలిస్తే వాళ్లెలాగా వెంటపడతారు. మీకు అభ్యంతరం లేకపోతే మీరున్న చోటున యీ రాత్రికి నాకు రక్షణ యివ్వగలరా?'

ఆ మాటలో గాని ఆ చూపులో గాని ఎక్కడా బజారు లక్షణాలు కనబడలేదు నాకు. ఎంత ఆమె తండ్రిలా కనిపించినా తెల్లారు ఝామున బస్సు ఎక్కేసే నేను యీ వయస్సు ఉన్న ఆడదాన్ని వెంటబెట్టుకొని ఎలా లాడ్జికి వెళ్లను!

'పోన్లెండి. అక్కర్లేదు. మానవత్వం అంటూ యింకా ఎక్కడుంది లోకంలో! శరీరం ముక్కలైనా చెయ్యగలరు. అతకనూ గలరు! గుండె రెండు ముక్కలయితే! చెయ్యవలసిందేదో నాకూ తెలుసు. మీరు వెళ్లండి.'

ఇంక నోరెత్తడానికి నాకేం సాకు కనిపించలేదు. ఆమెను బతిమాలి, లాడ్జికి తీసుకెళ్లేను. వెనక మెట్ల నుంచి మేడమీదికి తీసికెళ్లేను. అదృష్టవశాత్తూ ముప్ప్రొప్రైటరూ పరిశీలించినట్టు లేదు. నేను కేరేజి తీసుకు వెళుతుంటే ఆమె నన్ను వారించింది.

'నేనేం తినగలిగే స్థితిలో లేను. నాకు మీరిచ్చే ఆతిథ్యం నేను చెప్పిందల్లా వినడమే. పెద్ద ఫ్లాస్కు ఎక్కడైనా ఉంటే సంపాదించి ఇద్దరికి కప్పులు స్ట్రాంగ్ కాఫీ పోయించుకు రండి. అది చాలు.'

అక్షరాలా ఆవిడ చెప్పినట్టే చేశాను. అహంకారినని అంతర్లో పేరుబడిన నేను పూర్తిగా ఓ ఆడది ఎలా చెబితే అలా చేస్తున్నా నేమిటా అనిపించింది. ఫోంచేసి పస్తాంది. నాకు నేనే జవాబు చెప్పుకున్నాను మళ్ళీ. మొహం మీది స్ఫోటకం మచ్చలు లేకపోతుంటే, ఈ అమ్మాయి నన్ను బాగా కంగారుపెట్టిన చిన్నదానికి దగ్గిర చుట్టమే. సందేహం లేదు. అదే గొంతుక. అదే నడక. ఆఖరి ఫీటు అమ్మాయికీ యీమెకీ చాలా పోలికలు ఉన్నాయి.

నే ననుకున్నది నిజమేనని యీ అమ్మాయి ఒప్పుకుంది.

ఆ మేజిక్ చేసే అమ్మాయి పేరు రీటా. ఈ అమ్మాయి ఆమె కవల చెల్లెలు. పేరు రోజా. ఆ ఆఖరి ప్రదర్శన వీళ్లిద్దరూ కలిసి చేస్తారట.

నా ఆశ్చర్యానికి కంతులేకపోయింది.

ఇద్దరూ కలిసి చెయ్యడ మేమిటి!

నా ఆశ్చర్యం చూసి రోజా ఒకటే నవ్వు.

'మె లాంటి పూల్సు హాలు అంతా

నిండి ఉండగా మా ప్రదర్శనల కేం లోటం? నరకడానికీ అతకడానికీ మా బాస్ ఏమైనా శివుడా, బ్రహ్మా? అసలు నరకడం అంటూ జరిగితే కదా అతక వలసిన అవసరం! పెద్దవాసు. నేనిలా అంటున్నానని ఏం అనుకోకండి.'

ఆ విద్య ఎలా ప్రదర్శిస్తారో రోజా పూసగుచ్చినట్టు చెప్పింది.

ఆ పెద్ద పెట్టె నిజంగా ఒక పెట్టె కాదు. అలా కనిపించేటట్టు పక్క పక్కని అమర్చిన రెండు పెట్టెలు. కుడి చేతి వైపు పెట్టెలో కాళ్లూ చేతులూ కడుపు వైపు ముడుచుకుని రీటా బయటకి తలా చేతులపై భాగం ఉంచి, దూరు తుంది. అలా దూరడానికి ప్రత్యేకశిక్షణ యిస్తారు. ఆ పెట్టె కింది బల్లలో పైకి కనబడని ఓ అర ఉంటుంది. కాళ్లు మాత్రం ఎడంచేతి వైపు పెట్టె కింద కన్నంలోంచి దూర్చి పాదాలు బయటకు వచ్చేటట్టు పెడుతుంది. చూసేవాళ్లకి ఒక తలా కాళ్లూ ఒకరివే! అనిపించే 'ఇల్యూజన్' కల్పిస్తారు. రెండు పెట్టెల మధ్య సందులోకి రంపం దిగుతుంది. మోసపోయింది అమాయకులైన ప్రేక్షకులే గాని, హాయిగా లోపలున్న అక్క చెల్లెళ్ళకేం ప్రమాదం

'మరి ఆ గజ్జెల మాట?'

'ముజ్జగాలనీ మోసం చెయ్యడానికే ప్రత్యేకంగా ఆ ఏర్పాటు. గజ్జెలతో సహా రీటా మొదటి పెట్టెలో దూరి, పైకి వచ్చేటప్పుడు అక్కడ అవి వదిలి వచ్చే స్తుంది. నేను అచ్చు అలాగే పాదాలు అలంకరించుకొని, సరిగ్గా అలాంటి గజ్జెల జతే వేసుకుని ఉంటాను. అంతే!'

నిజమని భ్రమించిన దాన్ని మరో కోణంలో అది కాదని సరిపెట్టుకోడం చాలా కన్‌ఫ్యూజింగ్‌గా అనిపించింది. దాన్లోంచి ఇంకా నేను తేరుకోకుండానే రోజా మరో సవాలు విసిరింది.

'చూసేవాళ్లని గుడ్డివాళ్లని చేసి యింకా ఎన్నాళ్లు నాటకాలు ఆడగలరు లెండి! బాస్‌ని వల్లో వేసుకుంటే యిక ఫరవాలేదనుకుని కులుకుతోంది మా రీటా. దాన్ని నిజంగా రెండు ముక్కలు చెయ్య గల యీ చెల్లెలు సమయంకోసం చూస్తోందని యింకా తెలుసుకోలేదు కాబోలు....'

కలిసి అయిదేళ్లయి ఇస్తున్నారట వాళ్లా ప్రదర్శన. ఉన్నట్టుండి అక్క మీద చెల్లెలి కెందుకీ కక్ష? అడిగాను.

రోజా నా ప్రశ్నకి జవాబు చెప్పింది.

'మొదట్లో నేను క్లర్క్‌గా పనిచేసే దాన్ని. మెట్రిక్కే కాక టైపూ షార్టు హేండూ ప్యాసయ్యాను. రీటాకి ఎప్పుడూ తన అందం చూసి మురిసి పోడంతోనే సరిపోయేది. ఒక్క ముక్క అబ్బలేదు. ఏదో పని మీద ఆ ఆఫీసు కొచ్చిన మోహన్ మాతో పరిచయం పెంచుకున్నాడు. ఇద్దరి ఫిజికల్ మెజర్ మెంట్సూ ఒకేలా ఉండడం చూసి పెద్ద జీతం యిస్తానని చెప్పి యీ మేజిక్ గ్రూప్‌లోకి తీసుకున్నారు. అంతవరకూ నా జీతంతోనే రీటా బతికేది. కొంచె మైనా కృతజ్ఞత అనేది ఉండాలంటారా? ఇద్దరూ కలిసి కదా ఫీటు చేసేది - ఎంత కింద పెట్టెలో ఏడిస్తే మాత్రం నా క్కూడా ఆ ప్రదర్శనలో అంతో ఇంతో భాగం ఉంది కదా. ఎప్పుడూ ఫ్లడ్‌లైట్ల వెలుగులో దాని మొహమే మిల మిల మెరిసిపోవాలా? పేపర్లో ఎప్పుడు పేరు పడినా దాన్దే. ఏ విలేఖరితో యింటర్వ్యూ జరిగినా దానితోనే. తోడబుట్టిన సాటి ఆడదానిని ఎప్పుడూ 'అధోగతేనా'? మొదట్లో నేనూ పట్టించుకునేదాన్ని కాదు. కాని దాని గర్వం చూస్తూంటే ఒళ్లు మండిపోయింది. నా మొహానికి మచ్చ లున్నాయి గాని మనసుకి లేవే! ఓ సారి బాగా మేకప్ కొట్టించి అవకాశం యిమ్మని బతిమాలాను. ఒకే సారి. ఒక్కటంటే ఒక్కసారి. చెప్పండి. తప్పంటారా? ఇది అసూయ అంటారా? ఏమంటుందోనని వెళ్లబోయాను. దూరం నుంచే వాళ్ల మాటలు విని ఆగిపోయాను. 'ఇంకా నయం గంటు మొహం మొండ.. పోనీ ఏడుస్తుందనీ నీ సొంత చెల్లెలనీ సమాన జీతం యిస్తున్నాను.... నన్ను పెళ్లిచేసుకోమని అడిగింది కాదు. దీని ఆశ అంటించ. అతను నవ్వుతే తప్పు లేదు. నా మనసు యింతింత ముక్కలు చేస్తూ నేను ఎన్నాళ్లో పోషించిన నా సొంత అక్క కూడా అతన్తో నవ్వాలా? ఆ రోజే వెళ్లి గట్టిగా అడిగేశాను. ఓ రోజు మా రీటానే, ఓ రోజు నాకు ముఖ్యప్రదర్శన యిచ్చే అవకాశం యివ్వకపోతే ఈ ప్రదర్శన గుట్టు పేప ర్‌కి ఎక్కిస్తానని. వారం అయింది. అప్పట్నుంచి మరో అమ్మాయికి నా డ్యూటీ అప్పజెప్పేరు. నా మీద బ్రహ్మాండమైన నిఘా ఏర్పాటుచేశారు. అది తెలుసుకుని మొన్నటిరోజున గట్టిగా కేకలేస్తే, పిచ్చెక్కి అరుస్తోందని హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. పారి పోతుందని హెచ్చరించి రాత్రింబవళ్లు ఆస్పత్రిలో కాపలా పెట్టేరు. నాకు యిచ్చే నిద్రమందు కాపలామనిషి నీళ్ల గ్లాసులో పడేసి ఎలాగో తప్పించుకు వచ్చాను. ఆస్పత్రిలో ప్రతి నిమిషం ఆలోచించాను. మా అక్క చేసిన నేరా నికి దాన్ని రెండు కాదు, రెండొందల ముక్కలుగా తరిగినా తప్పులేదు. దానితో పుట్టి పెరిగేను. దాని ప్రతి అలవాటూ నాకు తెలుసు. దాన్ని చంపడం అదో బ్రహ్మవిద్యా? అది కాదుగాని ఆస్పత్రి నుంచి బయటపడ్డాక ఎందుకో మా ప్రద ర్శన నేనే ఓసారి ప్రేక్షకురాలిగా చూస్తే ఎలా ఉంటుందో అనిపించింది. అందులో మేమిద్దరం పాల్గొనే ప్రదర్శన దూరం నుంచి చూస్తే? మా ఏరియాలో ఎవరూ అడుగు పెట్టని కొన్ని రహస్య మార్గాలు నాకు తెలుసు. ఏమైతే అయిందని అతి

నెమ్మదిగా ఎవరి కంటాపడకుండా చివరి ప్రదర్శన సమయానికి, కొంచెం వేషం మార్చి, లోపల జొరపడ్డాను. చిత్రం ఏమిటంటే ద్వేషంతో అక్కడకు చేరిన దాన్ని ఆమాటే మరచిపోయాను. ఎంతో డిసిప్లిన్‌తో పెర్‌ఫెక్షన్‌తో జరిగిన ఆ ప్రదర్శన ఇచ్చిన అనుభూతిలో పడి మీ అందరితో పాటు నేనూ కొట్టుకు పోయాను!'

'గ్రేట్ యు ఆర్!' అన్నాను ఆమె రెండు చేతులూ పట్టుకుని. ఎంతో మామూలుగా అని వాటిని విదిలించేసింది. లేచి నిలబడింది. 'ఏదో మాట వరసకి అన్నాను గాని, ఏదో తాత్కాలికంగా అప్పటి కష్టుడు అనిపించి ఉండొచ్చు గాని, ఎవడికి తెలీదు. అందులో కిటుకు? గుట్టు తెలిసిపోయాక ఏం వుంటుందిక అందులో మజా! అందులో నన్నే కించ పరిస్తే నేనా ఊరుకొనేది, వాళ్ళ అంతు చూడక వదిలిపెడతానా? మీరే చూస్తూం డండి. ఏం జరుగుతుందో...అనుకున్నాను గాని యీ రాత్రంతా యిక్కడ గడపడ మంటే అదోలా ఉంది నాకు. ఈ మాత్రం ఆశ్రయం యిచ్చి చెప్పిందంతా విసుగు లేకుండా విన్నారు. అంతే చాలు. ఈ రాత్రికి రాత్రే ఏదో ఊరు చెక్కేసి అక్కణ్ణుంచే ప్లాను వేసుకుంటే క్షేమం కాదూ, ఏమంటారు? గంటల కొద్దీ వాగుతున్నాను. గొంతు తడారిపోయిందో ఏమిటో మరో కాఫీ చుక్క పొయ్యా లనైనా తోచిచావదేం మనిషికి? అంటూ తనే, ఫ్లాస్కుపాళంగా మిగిలిన కాఫీ నోట్లో పోసేసుకుంది. 'అప్పటికే చల్లారి పోయింద'ని విసుక్కుంటూ 'అలాగే నేనే వచ్చి దిగబెడతాను. ఈ రాత్రికి రాత్రే నువ్వు ఊరు దాటెయ్యడం నీకే కాదు అందరికీ మంచిదే.'

'అంటే?' అన్నట్టు ఉన్నట్టుండి 'మీరు' 'నువ్వు' లోకి దింపేశారేం?'

నేను దగ్గిరగా వచ్చి ఆమె తలమీద చెయ్యి వేస్తూ అన్నాను.

'ఆత్మీయత అంతరాల్ని భరించ లేదు మరి. వాళ్ళని నువ్వు ముక్కలు చెయ్యడం కాదు, నీ మనసు వాళ్ళెప్పుడో ముక్కలు చేశారు. పైపై అందం కాదిది. మంచి గంధానికి మచ్చలుండవు మరి!' రోజా తల పైకెత్తేను. ఆమె కళ్ళల్లో నీళ్ళు.

'నీకు చేతకాని పనులకి ఎందుకు పూనుకుంటావు, నీ స్థానంలో మరొకరు దూరినా దాన్ని మెచ్చుకోగలిగినంత గొప్ప హృదయం నీది.'

'అదేమిటండీ అలాఅంటారు. కీలకం ఏదో తెలిసిపోయాక ఈ ఇంద్రజాలం అంతా పచ్చిమోసం అనీ, ఏవరైనా చెయ్యగలరనీ అనిపించలేదా మీకు?'

'లేదు. అసలైన ఆర్టు హృదయం మీద వేసే ముద్ర అంత సులువుగా చెరిగిపోదు. ఏం వేసి ఎలా చేస్తారో తెలిసిపోయినంత మాత్రాన బాగా చేసిన మిఠాయి ఉండ రుచి కరిగిపోదు. 'లలిత కళ గొప్పదనం అంతా నిజాన్ని కప్పి పుచ్చడంలోనే ఉంది' అనే నిర్వచనాన్ని ఒప్పుకుంటే చాలా విషయాలు తెలుస్తాయి మనకి. ఈ మేజిక్ ఒకటే కాదు. ఓ నాటకం గాని సినిమా గాని నిజంగా జరిగిందే అని నమ్మి మనం వెళ్ళి ఆనం దించడం లేదు. శిల్పం అయినా కవిత్వ మైనా మరే కళ అయినా అంతే. ఎంతో సాధనతో మెళుకువ ప్రదర్శింపబడి కాంతినీ శబ్దాన్నీ మంచి నేర్పుతో వాడు కుని, ఇంతమంది ప్రేక్షకుల్ని మాయా లోకం లోకి మరలించిన యిలాంటి యింద్రజాలం ప్రదర్శన ఏ గొప్ప లలిత కళకీ తీసిపోనిది. ఎన్నిసార్లు చూసినా తనివి తీరనిది.'

'ఇంత బాగా చెబుతున్నారు. మీరు ఆర్టిస్టా?'

'ఏమో, ఇంగ్లీషు పొయిట్రీ రాస్తాను. నువ్వు మాత్రం కాదా. అందుకనే చూసి చూసి ఆర్టుని నాశనం చెయ్యలేక పోయావు.'

'నేను నాశనం చేద్దామనుకున్నది కరకు మనుషుల్ని గాని కళని కాదే!' 'మనుషులూ కళా వేరు వేరుగా లేవు. మీ అక్కని నరుకుతావు. ఎంతో క్రమ శిక్షణతో మంచి అనుభూతిని యిచ్చే యీ ప్రదర్శన గుట్టు బయటపెట్టి అపహాస్యం చెయ్యగలవు. మీ అక్క పోతే ఆ స్థానంలో మరొకర్తి వస్తుంది. ఈ ప్రదర్శన నవ్వులపాలు అయితే మరొకటి. కళ చిరంజీవి. అదిలేకుండా చెయ్యడం ఎవరి తరమూకాదు. అదలా ఉంచు. ఎలాంటి విపత్కర పరిస్థితిలో అయినా ఆర్టుని ఎంజాయ్ చెయ్యగల క్రియేటివ్ ఆర్టిస్టువి నువ్వు. నువ్వే కళని రూట్‌అవుట్ చెయ్యడం ఏమిటి? అబ్సర్డ్! పద పద కోణార్కకి టైం అయింది.'

టిక్కెట్టు కొని తెచ్చి బ్రీఫ్‌కేస్ లోపల పెట్టి వీడ్కోలు చెప్పేను.

'నీ మనసులో పుట్టిన ఈ తుఫాను పూర్తిగా వెలిసిపోయేదాకా ఉద్యోగం చెయ్యి. ఎడ్రస్ నోట్ చేసుకున్నావ్‌గా అక్కడికే వెళ్ళు. నా ఉత్తరం ఇయ్యి. మా ఫ్రండ్‌కి బాగా ఇన్‌ఫ్లుయన్స్ ఉంది. నీకు జాబ్ తప్పకుండా దొరుకుతుంది. హృదయాన్ని కదిలించేవీ, మనస్సుని వెలిగించేవీ చాలా యింగ్లీషు పుస్తకాలు ఉన్నాయి. చదువు. నీ గమ్యం రమ్యం అవుతుంది' వెళ్ళే ముందు రోజా రీటాకి రాసిన లేఖ–

'అక్కా.... ఇంత జరిగేక మరి అక్కడ ఉండలేను. జరిగింది మరచి పోదాం. జాబ్ దొరికాక మళ్ళీ రాస్తా. నీ పెళ్ళి పిలుపుకి ఎదురుచూస్తూ,

—రోజా